


సంపుటి-16 ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ వార్తాలేఖ ఆగస్టు-సెప్టెంబర్

సంచిక-1 ప్రధాన సంపాదకులు : ఎ. వెంకటేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఎ అండ్ పి, హెచ్ అండ్ ఎం) 2015

శ్రీ ఎన్.సాంబశివరావు, ఐ.పి.ఎస్
వైస్ చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్

# ఎం.డి గారి సందేశం



మిత్రులారా!

ఏ రోజుల్లోనయినా రవాణా చాలా కీలకం. మరి నేటి కాలంలో రవాణా ఇంకా ప్రాముఖ్యతను సంతరించుకుంది. అలాటి రవాణా రంగంలో ప్రత్యేకించి ప్రజా రవాణా సంస్థలో సేవ చేసే అవకాశం రావటం మన అదృష్టంగా భావించాలి.

స్వాతంత్ర్యానంతరం రోడ్డు రవాణా సంస్థల రూపంలో ఏర్పడినప్పుడు మన ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థ కూడా అందులో ఒకటి. కానీ తర్వాతి కాలంలో కార్మికుల అంకితభావంతో, చక్కని పద్ధతులతో దేశంలోనే అగ్రగామిగా మారింది. ప్రధానంగా ఇంధన పొదుపు, భద్రత వంటి పేరామీటర్లలో అన్ని రవాణా సంస్థలకంటే మిన్నగా నిలుస్తోంది.

అయితే మనం సాధించవలసింది ఇంకా వుంది. ఒక్క విజయంతో సరిపెట్టుకుంటే ప్రగతి అక్కడే ఆగిపోతుంది. శరవేగంగా మారుతున్న కాలం ఇది. ఎప్పటికప్పుడు కొత్త కొత్త పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయి. ఒకప్పుడు సాంప్రదాయబద్ధంగా ఆర్టీసీని నమ్ముకున్న పల్లెప్రజలు ఇప్పుడు ఆటోలు ఎక్కుతున్నారంటే కారణం ఏమనుకోవాలి? ఇలాంటి పరిస్థితులను మనం తెలివితో, నేర్పుతో, నూతన విధానాలతో మనకు అనుకూలంగా మార్చుకోవాలి. సరికొత్త విధానాలకు శ్రీకారం చుట్టాలి. సాంకేతిక వనరుల్ని వినియోగించుకోవడం వంటి చర్యలతో ప్రయాణీకులను మన బస్సులవైపు మళ్ళించుకోవాలి.

ఇటీవల జరిగిన రాజమండ్రి పుష్కరాలలో నేను స్వయంగా 15 రోజుల పాటు అక్కడే వుండి అధికారులతో, క్రింది స్థాయి సిబ్బందితో కలసి అహర్నిశలు పనిచేశాను. ఈ పుష్కరాలకు విశాఖ ప్రాంతం వైపు నుండి యాత్రికులు గోదావరి వరదలా వచ్చారు. వారిని చేరవేసేందుకు సుమారు 3000 బస్సులను నడిపాం. 70 లక్షల మందిని చేరవేశాం. ప్రయాణీకులను పుష్కర ఘాట్లకు చేరవేయడానికి 300 బస్సులను ఉచితంగా నడిపాం. ఆ సందర్భంలో తిరుగుప్రయాణపు ట్రాఫిక్ క్లియర్ చేసేందుకు తీసుకున్న సమయోచిత నిర్ణయాలు ప్రజల ఆదరణ, మన్ననలు నోచుకున్నాయి. అంటే మనం ఏం చేసినా ప్రయాణీకుల మెప్పును పొందుతూ చేసినప్పుడే ఫలితాలు ఇంకా ప్రభావవంతంగా వుంటాయని ఈ పుష్కరాలు రుజువు చేశాయి.అలాగే ఈ పుష్కరాలకు డ్యూటీలు చేయడానికి విచ్చేసిన సిబ్బందికి ప్రయాణీకులతో మనం ఎలా వ్యవహరించాలనే విషయంపై నేను చేసిన సూచనలను కండక్టర్లు, డ్రైవర్లు మనస్ఫూర్తిగా పాటించి సంస్థకు మంచి పేరు తెచ్చిపెట్టారు. వారందరికీ నా ప్రత్యేక అభినందనలు.

నిజానికి అన్నివేళలా ప్రయాణీకులు మనం అనుకున్నట్లుగా రాకపోవచ్చు. లేదా రావచ్చు కూడా. కాని వారికి బస్సు సౌకర్యాలు కలగచేసే విషయంలోనే మనం మన నేర్పు, పనితనాలు ప్రదర్శించాలి. పండుగలు, జాతరలు వంటి రద్దీ సందర్భాలలో బస్సులు నడిపేటపుడు కూడా మనం కొత్త విధానాలను అన్వేషించాలి.

అదే విధంగా కండక్టర్లు, డ్రైవర్లు, ఇతర సంబంధిత సిబ్బంది ట్రాఫిక్ రాబడి విషయంలో ప్రధానంగా ఒక విషయం గమనించాలి. ఏ బస్సు సర్వీసులైతే నష్టాలలో నడుస్తున్నాయో, ఆ సర్వీసులకు ఒకేసారి లాభం తీసుకొని రాలేకపోయినా, ముందు నష్టాలు లేని బ్రేక్ ఈవెన్ పాయింట్ సాధించాలి. ఇది చాలా ముఖ్యం. అలాగే ఏ సర్వీసులయితే లాభాల బాటలో వున్నాయో ఆ లాభాలను ఇంకా పెంచేందుకు కృషి చేయాలి. ఇందుకు మనం చేయవలసిందల్లా ప్రయాణీకులపై మన చూపు ఉంచడమే. ఒక ఉదాహరణ చెప్తాను. ఆకాశంలో ఎగిరే పక్షి ఆహారం కోసం ఏ విధంగా అయితే తన చూపులు నేల మీద పరిచి, ఆహారం కోసం వెతుక్కుంటుందో, అలాగే రోడ్డుకు ఎడమవైపున మన కోసం వేచి వుండే ప్రయాణీకుల మీదే మన చూపు వుండాలి. అది కూడ పక్షి తన అహారాన్ని వెతుక్కునేందుకు చూపే తపన ఎలా వుంటుందో అలా వుండాలి.

సంస్థ వైపు నుండి చూసినప్పుడు, ప్రజల అభ్యర్థనలను అర్థం చేసుకుని మనం ఇటీవలే విశాఖపట్నంలో మధురవాడలో కొత్త డిపో ఏర్పాటు చేసుకున్నాం. అలాగే కడపలో 2వ డిపో, గుంటూరు రీజియన్ పెదకాకాని లలో కొత్త డిపోలు ఏర్పాటుకు ప్రతిపాదనలు ఆమోదింపబడినాయి. ప్రజల కోరిక మేరకు పొన్నూరు, నిడదవోలు, కొవ్వూరులలో మూసివేయబడిన డిపోలను తిరిగి పున: ప్రారంభించడం జరిగింది. అలాగే ప్రయాణికుల సదుపాయాల కొరకు గత ఏడాది కంటే ఈ ఏడాది రూ.31 కోట్లు ఖర్చు పెట్టనున్నాం. విద్యార్థుల, ఇతర బస్సుపాసుల జారీ కంప్యూటరీకరించడం జరిగింది. ఇక ఉద్యోగుల విషయానికొస్తే జూలై 1 నుండి నూతన వేతన స్కేళ్ళు అమలుపరిచాం. ఈ కారణంగా సంస్థపై సాలీనా రూ.660 కోట్ల భారం పడుతుంది. అయినప్పటికి సిబ్బంది సంక్షేమానికి సంస్థ ఎంత ప్రాధాన్యత ఇస్తోందో అర్థం చేసుకుని, సిబ్బంది సంస్థ కోసం శ్రమించాలని కోరుతున్నాను.

ఇక – సంస్థ పరిపాలనా విభజన ప్రక్రియను మనం చాలా ప్రశాంతంగా పూర్తి చేసుకున్నాం. ఇక మిగిలిందల్లా 13 జిల్లాల ప్రజల రవాణాతో మనం మరో అడుగు ముందుకేసి, ఎప్పట్లానే దేశ రోడ్డు రవాణా చిత్రపటంపై మనదైన ముద్ర పదిలంగా కాపాడుకోవడమే. ఎ.పి.ఎస్.ఆర్.టి.సి సిబ్బంది ఆ కర్తవ్యాలను సమర్థంగా చిత్తశుద్ధి, అంకితభావాలతో నిర్వహిస్తారని ఆకాంక్షిస్తూ...

అభినందనలతో .... మీ

(నండూరి సాంబశివరావు)



## మద్దిలపాలెం డిపోలో స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలు

ప్రతి ఏటా సంస్థ ప్రధాన కార్యాలయం, బస్‌భవన్ లో నిర్వహించే స్వాతంత్ర్యదినోత్సవ సంబరాలు ఈ సారి విశాఖపట్నం, మద్దిలపాలెం డిపోలో ఘనంగా నిర్వహించారు. నాటి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ ఎన్.సాంబశివరావు, ఐ.పి.ఎస్ హాజరై జాతీయ పతాకాన్ని ఎగురవేసి గౌరవ వందనం స్వీకరించారు. అంతకుమునుపు మహాత్మాగాంధి చిత్ర పటానికి నివాళులర్పించారు. స్థానికంగా ఉత్తమ సేవలు కనబరిచిన 12మంది సిబ్బందికి నగదు బహు మతులు, ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. నాటి వేడుకలకు డైరెక్టర్ (విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ) శ్రీ కె.వి.వి గోపాలరావు,ఐ.పి.ఎస్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు శ్రీ ఎ.వి.రావు, శ్రీ జి.జయరావు, విజయనగరం జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీ రామకృష్ణ, విశాఖ రీజనల్ మేనేజరు శ్రీ.జి సుధేష్ కుమార్ , డిప్యూటీ సిటిఎం(బోర్డ్) /హెడ్డాఫీస్ శ్రీ త్రినాధ్ బాబు తదితర అధికారులు, సూపర్వైజర్లు, ఉద్యోగులు, సిబ్బంది మరియు యూనియన్ ప్రతినిధులు హాజరయ్యారు. వర్షం కురుస్తున్నా భారీ సంఖ్యలో సిబ్బంది, ఉద్యోగులు అలాగే నిలబడి ఈ వేడుకలలో పాల్గొనడం విశేషం.



స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు హాజరైన మహిళా సిబ్బంది

## ఇంధన వినియోగంలో పొదుపుకు అవార్డు

ఇంధన వినియోగంలో అత్యుతమ పొదుపు కనబరిచినందుకు గాను ప్రతిష్టాత్మక ఎ.ఎస్.ఆర్.టి.యు అవార్డు మరోమారు సంస్థ దక్కించుకుంది. 2013-14 సంవత్సరానికి గాను దేశం లోని రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలన్నిటిలో ఇంధన వాడకంలో అత్యుత్తమ పొదుపు(5.29) పాటించినందుకు గ్రూపు-1 మొఫిసిల్ సర్వీసులు కేటగిరిలో (10 వేల వాహనాలకు మించిన రోడ్డు రవాణా సంస్థలన్నింటిలో) అగ్ర స్థానంలో నిలిచి వరుసగా 4వ సారి ఈ అవార్డు దక్కించుకుంది.



ఎ.ఎస్.ఆర్.టి.యు స్వర్ణోత్సవాల సందర్భంగా, ఆగస్ట్ 4వ తేదీన న్యూఢిల్లీ లోని మాణిక్ షా సెంటర్‌లో జరిగిన ఉత్సవంలో సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఇ) శ్రీ ఎ.కోటేశ్వరరావు, సి.ఎం.ఇ(ఒ) శ్రీ కె.వి.ఆర్. కె.ప్రసాద్ లు భారత ప్రభుత్వ భారీ పరిశ్రమలు మరియు పబ్లిక్ ఎంటర్ ప్రైజెస్ కార్యదర్శి చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్నారు. ఇంధన పొదుపులో 1986-87 నుండి ఇప్పటి వరకు సంస్థ సాధించిన 35వ ఎ.ఎస్.ఆర్.టి.యు అవార్డు ఇది.

2013-14 సంవత్సరంలో సంస్థ మొఫిసిల్ ఆపరేషన్ క్రింద 14,560 బస్సులు,18109.05 లక్షల కిలో మీటర్ల మేర నడిపి 3422.52 లక్షల లీటర్ల డీజిల్ వినియోగించింది. తక్కువ కె.ఎం.పి.ఎల్ వస్తున్న డ్రైవర్లను డిపో/రీజియన్ స్థాయిలో గుర్తించి వారికి తగిన శిక్షణ ఇవ్వడం, తక్కువ కె.ఎంపి.ఎల్ వస్తున్న బస్సులను సకాలంలో గుర్తించి సరిచేయడం, చక్కని కె.ఎం.పి.ఎల్ పాటిస్తున్న డ్రైవర్లను, మెకానికల్ సిబ్బందిని గుర్తించి నగదు బహుమతులు, ప్రశంసాపత్రాలు, సన్మానాలతో ప్రోత్సహించడం వంటి చర్యల ద్వారా సంస్థ ఇంధన పొదుపు సాధిస్తున్నది.